విద్యార్థులు నాయకులుగా ఎదగాలి

- పోలీస్ కమిషనర్ త్రివిక్రమ్ వర్మ ఆకాంక్ష
- ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో ఘనంగా ఇన్వెస్టిచర్ వేడుక



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ విద్యార్థులతో సీపీ త్రివిక్రమ్ వర్మ, ప్రిన్సిపాల్ మనోజ్

సీతమ్మధార: విద్యార్థి స్థాయిలో నాయకత్వం వహించడం ద్వారా బాధ్యతాయుత నాయకులుగా ఎదగవచ్చని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ అన్నారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన ఇన్వెస్టిచర్ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విద్యార్థుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థుల ప్రార్థనతో ప్రారంభమైన వేడుకలో నాయకులుగా ఎంపికైన స్టూడెంట్లకు బ్యాడ్జీలు, స్కూల్ జెండాలు ఆయన అందజేసి అభినందించారు. అనంతరం విద్యార్థి నాయకులు, ఇతర క్యాబినెట్ సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా సీపీ త్రివిక్రమ్ వర్మ మాట్లాడుతూ హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఇద్దరూ స్కూల్ పేరుప్రతిష్టలు పెంచేలా బాధ్యతతో నాయకత్వం వహించాలని ఆకాంక్షించారు. తన సోదరి కూడా ఎస్ఎఫ్ఎస్ స్కూల్‌లోనే విద్యనభ్యసించి కొలంబస్‌లో ఉన్నత స్థితిలో స్థిరపడినట్లు తెలిపారు. స్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పి.మనోజ్ మాట్లాడుతూ ఇన్వెస్టిచర్ వేడుక(పెట్టుబడి వేడుక) కేవలం బాధ్యతలను అందజేయడం మాత్రమే కాదని, విద్యార్థినీ విద్యార్థుల సామర్థ్యం, క్రమశిక్షణకు గుర్తింపు అన్నారు. తమ అధ్యాపక సిబ్బంది ఉత్తమ పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి విశేష కృషి చేస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ కె.వి.జోసెఫ్, అడిషనల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ నాగేంద్ర, ఏసీపీ ఆర్.వి.ఎస్.ఎన్.మూర్తి , ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ సీఐ సీహెచ్ సింహాద్రి నాయుడు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శనిత్రయోదశి పూజలు



నవగ్రహాలకు పూజలు చేస్తున్న రాజాస్వామి

సీతమ్మధార: శనిత్రయోదశి సందర్భంగా సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో శనివారం నవగ్రహాలకు ప్రధాన అర్చకుడు రాజాస్వామి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వం.. సుపరిపాలన

- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- 43వ వార్డులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న కె.కె.రాజు, కార్పొరేటర్ ఉషశ్రీ

సీతంపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. ప్రజలందరి శ్రేయస్సును కాంక్షిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురం సచివాలయం పరిధి నందగిరినగర్‌లో శనివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీతో కలిసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, పొందిన లబ్ధిని వివరించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చేలా సీఎం వైఎస్ జగన్ నవరత్నాలు పేరిట సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రజాసంకల్ప యాత్రలో 'నేను విన్నాను.. నేను ఉన్నాను' అని చెప్పి అధికారంలోకి రాగానే ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని చెప్పారు. స్థానిక సమస్యల సత్వర పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందని తెలిపారు. గతంలో ఏ పథకం ద్వారా లబ్ధి పొందాలన్నా కార్యాలయాలు, నాయకుల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని గుర్తుచేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే తెచ్చిందని పేర్కొన్నారు.

అద్భుత కార్యక్రమం..

కార్పొరేటర్ ఉషశ్రీ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు స్వయంగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకునే అద్భుత కార్యక్రమం గడప గడపకు మన ప్రభుత్వం అని చెప్పారు. దీనికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. స్థానికుల సమస్యలు తెలుసుకుని ఆ మేరకు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జక్కంపూడి సత్యనారాయణ, ఎస్.తిరుపతి, బైర వెంకట్, పారుపల్లి రవి, నరసయ్య, వీరబాబు, రాణి, ఎస్.కుమార్, సింహాచలం, ప్రశాంత్, సన్యాసిరావు, వల్లి, బాధ శ్రీను, చంద్రకళ, బానాల తరుణ్, షేక్ బాబ్జి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి దుర్గాబాయి దేశ్‌ముఖ్



దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శుభ, వాకర్స్ క్లబ్ సభ్యులు



అప్సరఖాన్‌ను సత్కరిస్తున్న శేషామణి

మురళీనగర్: బహుముఖ ప్రజ్ఞాశాలిగా సంఘ సంస్కర్త దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ ప్రసిద్ధి చెందారని వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ అన్నారు. మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం దుర్గాబాయి దేశ్‌ముఖ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. క్లబ్ ప్రతినిధులు కె.వినీల, ఎస్.రోజారాణి , జి.షీలారాణి, శిరీషలత, కమిటీ సభ్యులు సురేంద్రకౌర్, జి.మంగాదేవి, ఎం.జయ, పాప, జిలాని పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో..

మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ చిత్రపటానికి క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి పూలమాల వేసి నివాళులర్పించారు. క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణలో ట్రైనర్ అప్సర ఖాన్‌ను సత్కరించారు. క్లబ్ కార్యదర్శి సనపల పుష్పలత, పూర్వ అధ్యక్షురాలు కె.మాధవి, ఇల్లూరి ఇందిర, ఉపాధ్యక్షురాలు సీహెచ్.వరలక్ష్మి, డైరెక్టర్స్ జి.లక్ష్మి, గీతాభాను, హిమబిందు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వైద్యులు, ఏఎన్ఎంలతో డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సూచించారు. సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో శనివారం సీజనల్ వ్యాధులపై ఏఎన్ఎంలకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వానా కాలం నేపథ్యంలో వర్షాలు విస్తరంగా కురిసే అవకాశం ఉందన్నారు. ఈ సమయంలో వ్యాధులపై వైద్యులు, ఏఎన్ఎంలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు మాట్లాడుతూ నేషనల్ ఫీవర్ హెల్త్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన మార్గదర్శక సూత్రాల ప్రకారం సర్వే చేసి వివరాలను యాప్స్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఈ విషయంలో ఏఎన్ఎంలు, వైద్యులకు ప్రత్యేక అవగాహన కల్పించారు. డాక్టర్ సత్యవేణి, డాక్టర్ సమత, నోడల్ అధికారి డాక్టర్ రమారెడ్డి, వివిధ ప్రొగ్రాంల అధికారులు పాల్గొన్నారు.

ఎడ్‌సెట్‌లో మాధవధార విద్యార్థిని ప్రతిభ

- రాష్ట్ర స్థాయిలో 11.. పీజీలో 58వ ర్యాంకు సాధించిన పూజారి వెంకటసూర్య వర్ష



మురళీనగర్: మాధవధారకు చెందిన పూజారి వెంకటసూర్య వర్ష ఎడ్‌సెట్, పీజీ ప్రవేశ పరీక్షల్లో విశేష ప్రతిభ చూపింది. ఏపీ ఎడ్‌సెట్‌లో 96 మార్కులతో ఇంగ్లిష్ విభాగంలో 11వ ర్యాంకు, ఎంఏ ఇంగ్లిష్‌లో ఏపీపీజీసెట్‌లో 58వ ర్యాంకు సాధించింది. ఒకేసారి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించడం విశేషం. వర్ష తల్లి పూజారి లత ఈస్ట్ కోస్ట్ రైల్వేలో పనిచేస్తున్నారు. ఆమె సహకారం, మావయ్య ఉమాపతి ప్రోత్సాహంతో తాను ఈ ర్యాంకులు సాధించగలిగానని విద్యార్థిని తెలిపింది. ఉపాధ్యాయ వృత్తి అంటే ఇష్టమని, అందుకే బీఎడ్ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పింది. ఆంధ్రా యూనివర్సిటీలో బీఎడ్ చేస్తానంది. జ్ఞానాపురంలోని సెయింట్ జోసెఫ్ కాలేజీ ఫర్ వుమన్స్‌లో బీఏ ఇంగ్లిష్ స్పెషలైజేషన్‌తో గ్యాడ్యుయేషన్ చేసింది. డిగ్రీ ఫైనలియర్ ఫలితాల కోసం ఎదురు చూస్తోంది. వర్ష నాన్న పూజారి వెంకట తిరుమల ప్రసాద్ ఈస్ట్ కోస్ట్ రైల్వే పాఠశాలలో టీచర్‌గా పనిచేసి 2014లో మరణించారు. తండ్రితో పాటు మావయ్య సనపల ఉమాపతి కూడా టీచర్ కావడంతో వారిని స్ఫూర్తిగా తీసుకుని టీచర్ కావాలనే ఆశయంతో చదివినట్లు వర్షం పేర్కొంది. డిస్టెన్స్ మోడ్‌లో చేరి ఏయూలో ఇంగ్లిష్‌లో పోస్ట్ గ్యాడ్యుయేషన్ కూడా పూర్తి చేస్తానంది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు ఉమామతి, ఆమె కుటుంబ సభ్యులు వర్ష అభినందించారు.

విభేదాలకు పరిష్కారం యూసీసీ కాదు



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతంపేట: భిన్నత్వాల మనుగడే ప్రజాస్వామ్యానికి ఉనికి అని, అసమాన సమాజంలో యూనిఫాం సివిల్ కోడ్(యూసీసీ) ఎవరి ప్రయోజనాల కోసమని పలువురు వక్తలు అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రగతిశీల మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో యూసీసీపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి మాట్లాడుతూ మహిళలపై అన్ని మతాల్లోని అనాచారాలను తొలగించేందుకు, రాజ్యాంగ బద్ధ హక్కులను కాపాడేందుకు తగు చర్యలు తీసుకోవాలే తప్ప.. యూసీసీ అవసరం లేదని 2018లో వేసిన లా కమిషన్ చెప్పిందని గుర్తుచేశారు. విభేదాలు ఉన్నంత మాత్రాన వాటికి పరిష్కారం యూసీసీ కాదని చెప్పిందని, 21వ లా కమిషన్ ప్రతిపాదనలను బుట్ట దాఖలు చేసిన పాలకులు తమ రాజకీయ లబ్ధి కోసం పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపట్టారని విమర్శించారు. డ్రాఫ్ట్‌పై చట్టసభలో చర్చించకుండా, ప్రజాభిప్రాయం తీసుకోకుండా ఆఘమేఘాల మీద రాష్ట్రపతి ఆమోద ముద్ర చేయించాలని చూస్తున్నారన్నారు. గతంలో రైతు వ్యతిరేక చట్టాలను ఎలా దుర్మార్గంగా తెచ్చారో ఆదే పద్ధతిలో డ్రాఫ్ట్ లేకుండా యూసీసీ మీద ఆమోదం తెలపని ప్రజలను లా కమిషన్ ద్వారా కోరుతుందని, ఈ విధానాన్ని ప్రగతిశీల మహిళా సంఘం తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. సమావేశంలో పలు ప్రజా సంఘాల నాయకులు వారి అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

భార్యను మేడపై నుంచి తోసేసిన భర్త అరెస్ట్

సీతమ్మధార: భార్యను మేడపై నుంచి తోసేసిన ఘటనలో భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఫోర్త్ టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా.. అక్కయ్యపాలెం లలితానగర్‌లోని గ్రూప్ హౌస్‌లో నివసిస్తున్న సూర్యచంద్ర, హారికల మధ్య కొద్ది నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నెల 13న ఇద్దరి మధ్య గొడవ జరిగింది. భర్త సూర్యచంద్ర, తన భార్య హారికను మేడపై నుంచి తోసేయడంతో షెడ్ మీద పడి కిందన పడటంతో ఆమె తలపై తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. శనివారం సూర్యచంద్రను ఫోర్త్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. నిజం నిర్ధారణ కావడంతో రిమాండ్‌కు తరలించారు. వీరికి 2013లో వివాహమైంది. ఇద్దరు పిల్లలు. భర్త ఒక ప్రైవేట్ కంపెనీ డీలర్ షిప్ నడుపుతున్నాడు.

విద్యార్థినికి తీవ్ర గాయాలు

సీతమ్మధార: ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి దొండపర్తి నెహ్రూ బజార్ వద్ద హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థిని శుక్రవారం రాత్రి మేడపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతోంది. పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు విద్యార్థిని పరిస్థితి విషమంగా ఉంది. సంఘటనా స్థలానికి ఫోర్త్ టౌన్ సీఐ శ్రీనివాసరావు చేరుకుని విచారణ చేపట్టారు. మేడపై నుంచి విద్యార్థిని పడిపోవడానికి గల కారణంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

యువకుడిపై దాడి

సీతమ్మధార: ఓ యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు కృష్ణ తెలిసిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి నందగిరి కాలనీకి చెందిన ఎస్.కృష్ణ అనే యువకుడు అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులోని అల్యూమినియం షాపులో పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి షాపు క్లోజ్ చేయడంతో యాజమాని వద్ద నుంచి చేతిఖర్చులకు రూ.200 తీసుకున్నాడు. ఆటోలో మద్యం తాగుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు కృష్ణపై దాడికి పాల్పడ్డారు. తలపై తీవ్ర గాయాలవడంతో ఆ యువకుడు పోలీసులకు ఆశ్రయించాడు. పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది.

సబ్సిడీపై బియ్యం, కందిపప్పు విక్రయాలు



వినియోగదారులకు కందిపప్పు అందిస్తున్న మార్కెటింగ్ అధికారి షేక్ యాసిన్

సీతమ్మధార: బహిరంగ మార్కెట్‌లో ధరలు పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారుల సౌకర్యార్థం సబ్సిడీపై నాణ్యమైన బియ్యం, కందిపప్పు విక్రయిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ, వాణిజ్య, మార్కెటింగ్ శాఖ అధికారి షేక్ యాసిన్ తెలిపారు. సీతమ్మధార రైతుబజార్‌లో శనివారం రాయితీపై బియ్యం, కందిపప్పు విక్రయాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మార్కెట్ ధర బియ్యం కిలో రూ.52 ఉండగా.. రైతుబజార్ కౌంటర్‌లో రూ.46కు, దేశవాళీ కందిపప్పు కిలో రూ.145 కాగా.. రూ.137కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బియ్యం 80 బస్తాలు, కందిపప్పు మూడు బస్తాలు విక్రయించినట్లు తెలిపారు. ఏఎస్సార్, అనకాపల్లి, విశాఖ జిల్లాల్లో ఈ క్రాప్ ద్వారా రైతులు పండించే పంటలపై సర్వే చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం రైతుబజార్‌లోని సూపర్ బజార్ కౌంటర్లలో కందిపప్పు నాణ్యతను యాసిన్ పరిశీలించారు. ఆయన వెంట ఈవో కొండబాబు, సహాయకుడు సతీష్ ఉన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం

సీతంపేట: సాహితీ స్రవంతి విశాఖ జిల్లా కార్యదర్శిగా వ్యవహరించిన నూనెల శ్రీనివాసరావు తృతీయ వర్ధంతిని పురస్కరించుకుని అభ్యుదయ కవితలు, మినీ కవితల పోటీ నిర్వహించనున్నట్టు సంస్థ కన్వీనర్ పెంటకోట రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ ఉత్తమ కవితకు రూ.2 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.1,500, తృతీయ బహుమతిగా రూ.1,000 అందిస్తామని చెప్పారు. 82477 97303, 94900 99222 నంబర్లకు వాట్సాప్ ద్వారా గాని, సాహితీ స్రవంతి విశాఖ జీ మెయిల్‌కు గాని ఈ నెల 20లోగా కవితలు పంపించాలని ఆయన కోరారు.

దంత వైద్య శిబిరం నేడు

సీతంపేట: అనిల్ నీరుకొండ దంత వైద్యశాల వైద్యులచే ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు లెట్స్ స్పీక్ స్పోకెన్ ఇంగ్లిష్ ఇన్‌స్టిట్యూట్ మేనేజింగ్ డైరెక్టర్ సురేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ రోడ్‌లోని తమ ఇన్‌స్టిట్యూట్ వద్ద ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు శిబిరం కొనసాగుతుందన్నారు. దంతాల క్లీనింగ్, పుచ్చుపళ్లకు సిమెంటు పెట్టడం, కదిలేపళ్లను తొలగించడం, నోటి ఆరోగ్యంపై అవగాహన, ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 99597 51194 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

108 రథసారథులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా అరబిందో ఎమర్జెన్సీ మెడికల్ సర్వీసెస్ (ఏఇఎంఎస్) ఆధ్వర్యంలో నడిపిస్తున్న 108,104,102 సర్వీసులో పని చేస్తున్న పైలెట్లకు శిక్షణ నిర్వహించింది. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో జరిగిన ఈ శిక్షణలో భాగంగా కమ్యూనికేషన్ స్కిల్స్‌తో పాటు వర్షాకాలం నేపథ్యంలో పైలెట్లకు డ్రైవింగ్‌లో మెలకువలు, సిగ్నలింగ్ వ్యవస్థపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఫ్లీట్ మేనేజర్ రవికిరణ్, డిస్ట్రిక్ట్ ఫ్లీట్ మేనేజర్ జగ్గరాజు, డిస్ట్రిక్ట్ మేనేజర్ త్రినాథ్, విశాఖ సిటీ కోఆర్డినేటర్ సురేష్, అనకాపల్లి కోఆర్డినేటర్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రెడ్ ఎఫ్ఎం 'అమేజింగ్ రుచులు'

సీతమ్మధార: రెడ్ ఎఫ్ఎం 'అమేజింగ్ రుచులు' కార్యక్రమాన్ని శనివారం సీతమ్మధార లాసమ్ ఆక్సిజన్ టవర్స్‌లో నిర్వహించారు. చెఫ్ ప్రేమ్ తయారు చేసిన ఆశీర్వాద్ రుచులను మహిళామణులు ఆస్వాదిస్తూ సందడి చేశారు. వారితో కొన్ని రకాల వంటకాలు తయారు చేయించారు. రెడ్ ఎఫ్ఎం ప్రొగ్రాం హెడ్ సుస్మా ఎస్.ఇంజేటి మాట్లాడుతూ నగరంలోని ప్రముఖ ప్రాంతాల్లో నాలుగు వారాల పాటు అమేజింగ్ ఆశీర్వాద్ రుచుల సమ్మేళాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు బహుమతులు అందిస్తున్నామన్నారు. వైజాగ్ ఫుడ్ లవర్స్ గ్యాంగ్ ఆర్జే కిరణ్ వ్యాఖ్యా శైలితో కార్యక్రమాన్ని రక్తికట్టించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కె.కె.రాజు, పద్మారెడ్డి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు సచివాలయం(1086123) గాంధీనగర్‌లో అభివృద్ధి పనులకు శనివారం కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధుల ద్వారా మంజూరైన రూ.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లతోపాటు నక్కవానిపాలెంలో సామాజిక భవనం నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీరామ్మూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, వార్డు గ్రామ పెద్దలు, కార్యకర్తలు పాల్గొన్నారు.